ఈనాడు
శ్రీకాకుళం
మంగళవారం అక్టోబరు 22, 2024 5

ఇసుక రేవుల్లో ట్రాక్టర్ల జాతర..

నిర్మాణ రంగానికి కొత్త ఊపు

– న్యూస్‌టుడే, నరసన్నపేట

కొన్నాళ్లుగా ఇసుక కొరత కారణంగా కుదేలైన నిర్మాణ రంగం ఉచిత ఇసుక విధానం అమల్లోకి రావడంతో ఊపందుకుంది. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ఉచితంగా రవాణా చేసుకోవచ్చునని ముఖ్యమంత్రి ప్రకటనతో నిర్మాణదారుల కొరత తీరుతోంది. జిల్లాలో కీలకమైన వంశధార నదికి ఇసుక ట్రాక్టర్లు వరుస కడుతున్నాయి. గత ఐదేళ్లుగా ఇసుక ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో నిర్మాణ రంగం చతికిలపడింది. కూటమి అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు హామీని నెరవేర్చారు. గత రెండు రోజులుగా మడపాం, కరజాడ, లుకలాం, చేనులవలస, బుచ్చిపేట తదితర రేవుల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా సాగుతోంది. మడపాంలో జాతరను తలపించేలా వందలాది ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. సోమవారం ఒక్కరోజు వెయ్యి ట్రాక్టర్ల లోడ్లు తరలించినట్టు అంచనా.


మడపాం రేవులో ట్రాక్టర్లు


ఇసుకతో తరలిపోతూ..

ఎడ్ల బండ్లకు తగ్గిన గిరాకీ

ఇసుక రవాణాపై ఆంక్షల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాలైన మడపాం, కరజాడ, భైరి, గోపాలపెంట తదితర గ్రామాలకు చెందిన ఎడ్ల బండ్లతో ఇసుక రవాణా జోరుగా సాగేది. మొన్నటివరకు ఎడ్ల బండి లోడు రూ.1800 వరకు అమ్ముడయ్యేది. ప్రస్తుత విధానంలో ట్రాక్టర్లను అనుమతించడంతో ఎడ్లబండ్లకు గిరాకీ లేదు. ఒక్కో ట్రాక్టరు లోడు ఐదు బండ్ల ఇసుకతో సమానం. కాగా ట్రాక్టరు ఇసుక తగ్గి ప్రస్తుతం రూ.1,200 చేరింది.

ఆపరేటర్లలో సంతోషం

ఉచిత ఇసుక విధానం అమలుతో మూలకుచేరిన ట్రాక్టర్లు ఒక్కసారిగా బయటకొచ్చాయి. చేతినిండా పని కల్పించినట్లయింది. దీంతో డ్రైవర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లుగా ఉపాధి కోల్పోయామని పేర్కొన్నారు. నిర్మాణ రంగానికి చెందిన వేతనదారుల్లో సైతం సంతృప్తి వ్యక్తమవుతోంది. వారం రోజుల్లో నిర్మాణ పనులు వేగవంతమవుతాయని భవన నిర్మాణ కార్మికులు చెబుతున్నారు. మరోపక్క గోపాలపెంట రేవులో నదిలోంచి ఇసుక ఒడ్డుకు చేర్చే ప్రక్రియ కూడా సాగుతోంది. ఈ ఇసుకను ఇతర ప్రాంతాలకు లారీల ద్వారా రవాణా చేసేందుకు అనుమతి ఇవ్వనున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 344 సాగునీటి సంఘాలను గుర్తించినట్లు తెలిపారు. భారీ, మధ్య, చిన్న నీటి వనరుల సంఘాల పరిధిలో ఓటరు జాబితాల రూపకల్పనకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గతంలో నిర్ధారించిన ఆయకట్టు కింద ఉన్న సర్వే నంబర్ల వారీగా జాబితా నవీకరించామని చెప్పారు. తుది ఓటరు జాబితా వచ్చే నెల 13న ప్రచురిస్తామన్నారు. వచ్చే నెల 21 నుంచి 27 వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు.

అమరుల త్యాగాలు మరువం..

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం





పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సంస్మరణ కార్యక్రమాలు సోమవారం జరిగాయి. ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో అమరుల త్యాగాలను కీర్తిస్తూ పోలీసులు, ప్రజాప్రతినిధులు అంజలి ఘటించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టరు స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. తొలుత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ మౌనం పాటించారు. విధి నిర్వహణలో అమరులైన బంగారునాయుడు, పాపారావు, నరేంద్రదాస్, వెంకటరమణ, కృష్ణమూర్తి కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి పేర్కొన్నారు.

–వివరాలు 6లో



పోర్టు పనులు చకచకా..

మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం రాకతో కదలిక వచ్చింది. . కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డితో కలిసి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం పనులను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్టు వాహనాలకు జెండా ఊపారు. వచ్చే జూన్ 12 నాటికి ఒక బెర్తుతో పోర్టును ప్రారంభించి షిప్ ల్యాండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి గుత్తేదారును ఆదేశించారు. – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

నవోదయలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపల్ డి.పరశురామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 8, 10 తరగతులు చదువుతున్న అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 30 వరకు గడువు ఉందని, పిల్లల తల్లిదండ్రులు గమనించాలని తెలిపారు.

ఎక్కడున్నాయో మూలాలు..?

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే పలాస

గాలి, నీరు, మట్టి నుంచి నమూనాల సేకరణ

కూటమి ప్రభుత్వం రాకతో పరిశోధనల్లో చలనం

ఉద్దానం.. ఈ ప్రాంతంలో తెలియని కిడ్నీ భూతం సంచరిస్తూనే ఉంది. ఎక్కడ నుంచి వస్తుందో ఎలా ఉంటుందో ఏ రూపాన విజృంభిస్తోందో తెలియని భయాన్ని పుట్టిస్తోందీ మాయదారి రోగం.. దీని మూలాలు కనుగొనడానికి అప్పటి తెదేపా ప్రభుత్వం చొరవ చూపినప్పటికీ తర్వాత వచ్చిన వైకాపా సర్కారు నిర్లక్ష్యంగా గాలికొదిలేసింది. పేరుకే కిడ్నీ పరిశోధన, ఆసుపత్రి భవనాన్ని ఆర్భాటంగా అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించినా ఎలాంటి పరిశోధనలకూ నోచుకోని దుస్థితి. ఐదేళ్ల పాటు ఉద్దానంలో ఎలాంటి పరిశోధనలు జరగలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మళ్లీ పరిశోధనలు ఊపందుకున్నాయి.


నీటి నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఉద్దానం వ్యాప్తంగా వేల సంఖ్యలో పెరుగుతున్న కిడ్నీ బాధితులకు న్యాయం చేకూరేలా అప్పట్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షేత్రస్థాయిలో పర్యటించి కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అప్పటి తెదేపా ప్రభుత్వం 2018లో కొలంబియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జార్జి ఇన్‌స్టిట్యూట్ పరిశోధనలకు తలపెట్టింది. వ్యాధి మూలాలను కనుగొనాలని యుద్ధప్రాతిపదికన రక్త నమూనాల సేకరణ ప్రారంభించారు. కవిటి, సోంపేట, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని ఏడు క్లస్టర్లలో 67 గ్రామాల్లో నివసిస్తున్న 95,658 మంది జనాభాలో 2,419 మంది వ్యక్తుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. సీరమ్ క్రియేటినిన్, హెచ్‌బీఏవన్‌సీ, ప్లాస్మా, డీఎన్ఏ, యూరిన్ వంటి పరీక్షలు ఒక వ్యక్తి నుంచి మూడు దశల్లో నిర్వహించారు. వీటి ఫలితాలు 2022లో తెలిశాయి. కానీ వ్యాధి మూలకారణం బయటపడకపోవడంతో తాజాగా పర్యావరణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.


పరిశోధన కేంద్రంలో ఆధునిక పరికరాలు

పేరుకే పరిమితం చేస్తారా..!

కిడ్నీ పరిశోధన కేంద్రంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో కేవలం నమూనాల సేకరణ, భద్రపరచడం వంటివే చేపడుతున్నారు. శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు లేకపోవడంతో వీటిని చండీగఢ్‌కు తరలించి అక్కడే పరిశోధనలు చేపడుతున్నారు. అక్కడికి వెళ్లిన తర్వాత పరిశోధన, ఫలితాలు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి. 2018లో చేపట్టిన రక్త నమూనాలకు 2022లో ఫలితాలు వచ్చాయంటే పరిస్థితులు ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇదే ఆసుపత్రిలో ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలను తీసుకొచ్చి ఇక్కడే పూర్తిస్థాయిలో పరిశోధనలు జరిగితే సమయం ఆదాతో పాటు వేగవంతంగా వ్యాధి కారకాన్ని కనుగొనవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

చండీగఢ్‌కు నమూనాలు..

కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి సెప్టెంబరు 2న కిడ్నీ పరిశోధన కేంద్రానికి పర్యావరణ శాస్త్రవేత్త చేరుకున్నారు. ఈయనతో పాటు పరిశోధనలకు అవసరమైన పరికరాలను తీసుకొచ్చారు. ఉద్దానం ప్రాంతంలో గాలి, నీరు, మట్టి, పురుగు మందుల అవశేషాలు, ధూళి వంటి నమూనాలను సేకరించే విధానం, వాటిని భద్రపరిచే తీరుపై ఏడు రోజుల పాటు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 20కి పైగా నమూనాలను సేకరించి భద్రపరిచారు. వీటిని చండీగఢ్‌కు పంపించి పరిశోధనలు చేయనున్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే..

కిడ్నీ వ్యాధిమూలాల అంశాన్ని వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రాకతో ఇటీవల పరిశోధనలకు చర్యలు చేపట్టాం. ఇక్కడే ఈ ప్రక్రియ జరగాలంటే కొన్ని ఆధునిక పరికరాలు, నిపుణులు అవసరం. కాని చాలా మంది ఇక్కడికొచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాను. వైద్యుల నియామకం, పరిశోధనలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటాం. **- గౌతు శిరీష, ఎమ్మెల్యే పలాస**

తిరిగొస్తేనే నాటి వైభవం..!

- టెక్కలి నుంచి తరలిపోయిన కీలక ప్రభుత్వ కార్యాలయాలు
- రెండు దశాబ్దాల్లో మారిన పరిస్థితులు

– న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం

ఒక పట్టణ అభివృద్ధి అక్కడి సేవల సామర్థ్యం, పాలకుల ఆశావహ దృక్పథంపై ఆధారపడి ఉంటుంది. గత రెండు దశాబ్దాల్లో టెక్కలి బాగుకు ఒక అడుగు పడితే ఒట్టు.. అన్నీ తిరోగమన చర్యలే జరిగాయి. ఇటీవల టెక్కలి నుంచి తరలిపోయిన ఉద్యానశాఖ సహాయ సంచాలకుల కార్యాలయం తిరిగి వచ్చింది. ఇలా గత 20 ఏళ్లలో తరలిపోయిన కార్యాలయాలు వెనక్కి వస్తే గతంలో అందిన సేవలన్నీ మళ్లీ అందే అవకాశముంది. రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు ఈ ప్రాంత వ్యక్తి కావడంతో ఈ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


టెక్కలిలోని ఉప కారాగారం (పాతచిత్రం)

గతంలో ఇలా..

☛ 2004లో టెక్కలి నుంచి సబ్‌జైలు తరలిపోయింది. అప్పటివరకు ఉన్న భవనాలు శిథిలస్థితికి చేరడం, పట్టణ శివారులో విశాలమైన స్థలంలో జైలు నిర్మించడానికి చేసిన ప్రణాళికలన్నీ అటకెక్కాయి. రెవెన్యూ, జైళ్ల శాఖ మధ్య సమన్వయం లేక కాలయాపన జరిగిపోయింది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. ప్రస్తుతం రిమాండ్ ఖైదీలను అటు పాతపట్నం, ఇటు నరసన్నపేట తరలిస్తున్నారు.

☛ టెక్కలిలో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటైంది. మరోవైపు న్యాయస్థానం సామర్థ్యం పెరిగి సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు సేవలు అందుబాటులోకి వచ్చాయి. జైలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

☛ ఇక్కడున్న అటవీశాఖ రేంజ్ కార్యాలయాన్ని తరలించేశారు. సొంతభవనం లేదనే సాకుతో నరసన్నపేటకు తీసుకెళ్లారు. రిజర్వుఫారెస్టు ప్రాంత సంరక్షణతో పాటు గ్రానైట్ కార్యకలాపాల్లో అక్రమాలు గుర్తింపు, తేలినీలాపురం విదేశీపక్షుల విడిది కేంద్రం సంరక్షణ బాధ్యతలు చూడాల్సిన కార్యాలయం అందుబాటులో లేక అక్రమాలు జరుగుతున్నాయి.


☛ ఎక్సైజ్‌శాఖ ఏఈఎస్ కార్యాలయం పలాసకు తరలించారు. మళ్లీ తీసుకొస్తామని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

☛ ఏఎంసీ కార్యాలయాన్ని సైతం వెళ్లిపోవడంతో రైతులకు మార్కెటింగ్‌శాఖ సేవలు మృగ్యమయ్యాయి.

☛ డివిజనల్ పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని జిల్లా విస్తరణలో తరలించేశారు.

వసతి సమస్య లేదు..

ఇతర ప్రాంతాలకు వెళ్లిన కార్యాలయాలను తిరిగి తీసుకొచ్చేక్రమంలో టెక్కలిలో ఆయా కార్యాలయాల నిర్వహణకు వసతి సమస్యలేదు. జిల్లా ఆసుపత్రిని నూతన భవన సముదాయానికి తరలించడంతో పాతభవనం ఖాళీగా ఉంది. ఇందులో ఇంకా సరిపడా వసతి అందుబాటులో ఉంది. చిన్నపాటి మరమ్మతులు చేస్తే సమీకృత కార్యాలయాల భవనంగా అందుబాటులోకి తీసుకురావొచ్చు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ భవన సముదాయాన్ని ప్రజల సేవకు వినియోగించడం ద్వారా పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంది. కార్యాలయం అంటే కేవలం ఉద్యోగుల నియామకమే కాక సంబంధిత పనులపై ఎందరో వస్తుంటారు. వారి రాకతో ఇతర సంస్థల, ఇతర వ్యాపారాలు, సందర్శనలు జరుగుతూ వస్తాయి. ఇవి లేకనే టెక్కలి అభివృద్ధిలో నిర్లిప్తత, నిస్తేజం నెలకొంది.


టెక్కలిలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న జిల్లా ఆసుపత్రి పాత భవనం

అవస్థల్లో ఆపద్బాంధవులు..

● నిలువ నీడ లేక విశ్రాంతి కరవు ● ఆరుబయటే 108 వాహనాల నిలిపివేత

ఆపద సమయంలో అత్యవసర వైద్య సేవలందించే 108 వాహనాల సిబ్బంది నిలువ నీడ లేక అవస్థలు పడుతున్నారు. షెడ్లు లేక వాహనాలు ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ రహదారుల పక్కన ఉంటున్నాయి. ఆసుపత్రుల పరిధిలో వసతులు కల్పించాలని కొన్నేళ్లుగా కోరుతున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు.

– న్యూస్‌టుడే, సోంపేట, కంచిలి గ్రామీణం


కంచిలిలో అసంపూర్తిగా 108 ఉద్యోగుల విశ్రాంతి భవనం

..జిల్లాలో 30 కేంద్రాల ద్వారా 31 అంబులెన్సులు అత్యవసర వైద్య సేవలందిస్తున్నాయి. 158 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, మెళియాపుట్టి, టెక్కలి (నవజాత శిశువుల వాహనం), పోలాకి, గార, ఆమదాలవలస, శ్రీకాకుళం, పలాస, కంచిలిలో సిబ్బందికి కొన్ని ప్రభుత్వ సంస్థల కార్యాలయాల్లో తాత్కాలిక వసతి ఏర్పాటు చేశారు. ఖాళీగా ఉన్న గదులను వినియోగించడం తప్ప ఎలాంటి సదుపాయాలు లేవు. శ్రీకాకుళంలో నీటిపారుదల శాఖకు సంబంధించిన శిథిల గదిని కేటాయించడంతో పెద్దగా ఉపయోగపడటం లేదు. ఎప్పుడు కూలుతుందో తెలియని ఆ గదిలోనే సిబ్బంది విశ్రాంతి తీసుకుంటున్నారు. పలాస ఎన్జీవో భవనం, కంచిలిలో కేంద్ర సహకార బ్యాంకుకు సంబంధించిన గదులను వినియోగిస్తున్నారు. చాలాచోట్ల ప్రభుత్వాసుపత్రుల్లోని వరండా, ఖాళీగా ఉన్న గదుల్లో ఉంటున్నారు. 19 కేంద్రాల్లో విశ్రాంతి తీసుకోవడానికి అవకాశం లేక ఆరుబయట ఉంటున్నారు.

◆ కంచిలిలో దాతల సహకారంతో నిర్మిస్తున్న విశ్రాంతి గది నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నిధుల కొరత తలెత్తడంతో సమస్య నెలకొంది.

◆ 108 వాహనాలను నిలపడానికి షెడ్లు లేక అందులో నిల్వ చేసే మందులు దెబ్బతింటున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర ఉష్ణోగ్రత, భారీ వర్షాల సమయంలో ఆరుబయట ఉండే వాహనాల్లోని మందులు ఉపయోగపడటం లేదని తెలిపారు.

◆ అత్యవసర వాహనాలను అన్ని విధులకు వినియోగించేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో సమస్యలు నెలకొన్నాయి. సామాజిక ఆసుపత్రుల నుంచి జ్వరాల కేసులు, ఇతర చిన్న ఇబ్బందులతో బాధపడుతున్న రోగులను సైతం ఇతర ఆసుపత్రులకు పంపుతుండటంతో రిఫరల్ వాహనంగా ఉపయోగించే పరిస్థితి ఏర్పడింది. ప్రమాదాలు, అత్యవసర సమయాలలో వాహనాలు అందుబాటులో ఉండటం లేదు.

ట్రాఫిక్ సమస్యతో చిక్కులు..: సమాచారం వచ్చిన వెంటనే వాహనం కదిలేందుకు అవకాశం లేని పరిస్థితి. చాలా ప్రాంతాల్లో సిబ్బంది ఎక్కడ ఉండాలో తెలియడం లేదు. ప్రత్యేకంగా వసతి గదులు, షెడ్‌లు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలి. **- విజయ్‌మోహన్, 108 ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు**


వైద్యారోగ్య శాఖతో సమన్వయం చేస్తాం..: సిబ్బందికి వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో గది కేటాయించేలా అధికారులతో మాట్లాడాం. వైద్యారోగ్య శాఖతో సమన్వయం చేసుకుంటూ వసతి, వాహనాలు ఉంచేలా ఏర్పాట్లు చేసేలా పర్యవేక్షిస్తాం. **- హరిప్రసాద్, డీఎం, 108 వాహనాల నిర్వహణ సంస్థ**

కేజీబీవీలో కలకలం

గోడ దూకి ఇద్దరు విద్యార్థినుల పరారీ

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాంలోని కస్తూర్బా విద్యాలయంలో ఇంటరు ప్రథమ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఆదివారం అర్ధరాత్రి గోడ దూకి పారిపోవడం సంచలనం సృష్టించింది. అర్ధరాత్రి 2.45 గంటలకు స్నానం చేసే బకెట్ల పైనుంచి గోడ అవతలకు దిగి పరారైనట్లు సీసీ టీవీ ఫుటేజీలో కనిపించింది. సోమవారం ఉదయం స్టడీ అవర్ కోసం పిల్లలను పిలిచే సమయంలో సిబ్బంది చూడగా ఇద్దరూ కనిపించలేదు. పాఠశాల ప్రత్యేకాధికారిణి ప్రమీల జిల్లా అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. పాఠశాలకు చేరుకున్న జిల్లా బాలికల సంరక్షణ అధికారిణి నీరజ, పోలీసులు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూదనరావు తెలిపారు.


జి.సిగడాం కస్తూర్బా విద్యాలయం



పుస్తకంలో లేఖ రాసి..

'అమ్మానాన్న, అన్నయ్యతో గడిపిన క్షణాలు గుర్తుకొస్తున్నాయి. మిమ్మల్ని విడిచిపెట్టి ఉండటం ఇష్టం లేదు' అంటూ ఒక విద్యార్థిని రాసిన లేఖను అధికారులు గుర్తించారు. విద్యాలయ ప్రహరీ దాటి రాత్రి వేళలో వెళ్లడం కష్టమని, గోడ అవతల దిగడానికి స్నానపు బకెట్ ఎవరు పెట్టారనే కోణంలో పరిశీలిస్తున్నారు.

రైతేరాజు 6లో

నిత్యాన్నదాన విరాళాల్లో అవకతవకలపై విచారణ

స్పందనకు వందనం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి దేవస్థానంలో నిత్యాన్నదానానికి భక్తులు సమర్పిస్తున్న విరాళాల్లో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేసేందుకు సోంపేట ఇన్‌స్పెక్టర్ వెంకటరమణను నియమించినట్లు జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ప్రసాద్‌పట్నాయక్ తెలిపారు. గతేడాది నుంచి ఆలయంలో నిత్యాన్నదానానికి భక్తుల అందిస్తున్న విరాళాలు ఖాతాలో జమ చేయక పోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై 'విరాళాలేమయ్యాయ్..?' శీర్షికతో సోమవారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు విచారణకు అధికారిని నియమించారు.

సిరిమానోత్సవ పూజలు ప్రారంభం



పాత శ్రీకాకుళంలో పదేళ్లకు ఒకసారి (వచ్చే ఏడాది జూన్‌లో) జరిగే సిరిమానోత్సవ పూజలు సోమవారం ముహూర్తాల ఊరేగింపుతో ప్రారంభమయ్యాయి. గ్రామ దేవతల సిరిమానోత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో భక్తులు పెద్దమ్మ తల్లి, సూరాలమ్మ, సన్యాల పోలమ్మ తల్లి ఆలయాల వద్ద చెట్లకు బొట్టు పెట్టి పూజలు చేశారు. దేశిల్ల వీధి నుంచి కలశాలతో బయలుదేరి నక్క వీధి, గౌడాది వీధి, దండి వీధి, చాకలి వీధి, మాపూరు వీధి, హరిజన వీధి, బాదు ర్లపేట, కొత్తపేట, కుసుమపేట, ఖాజీపేట వరకు ఊరేగింపుగా వెళ్లారు. ఖాజీపేటలో రెండు చింత చెట్లు, కొత్తపేట వద్ద వేప చెట్టుకు ముహూర్తాలతో వల్లవోత్సవం నిర్వహించారు. దమ్మల పూజారులు దండకం చదివి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవత సిరిమానోత్సవ కమిటీ ప్రతినిధులు, బారీఎత్తున భక్తులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

రైల్వే గేటును ఢీకొన్న వ్యాను

● అరగంట పాటు నిలిచిన రైళ్లు



పలాస, న్యూస్‌టుడే: పలాస రైలు నిలయం సమీపంలో కాశీబుగ్గ లెవెల్ క్రాసింగ్ గేటును వ్యాను ఢీకొనడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పలాసకు సర కులతో వస్తున్న వ్యాను గేటు వేస్తున్న క్రమంలో వేగంతో ఢీకొని ప్రయత్నించడంతో గేటు విరిగి పట్టాలపై పడిపోయింది. దీంతో రైళ్లు అరగంట పాటు నిలిచిపోయాయి. రైల్వే సిబ్బంది చేరుకుని మరమ్మతులు చేయడంతో యథావిధిగా నడిచాయి. రైల్వే ఆర్పీఎఫ్ అధికారులు కేసు నమోదు చేసి వ్యానును కార్యాలయానికి తరలించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తుకు గడువు పెంపు

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డీఎస్సీ రాత పరీక్ష నిమిత్తం ఇవ్వనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు నిర్దేశించిన గడువు పెంచారు. ఈ నెల 25 వరకు పొడిగించామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సర్పంచి కుటుంబం వెలి

సోంపేట, న్యూస్‌టుడే: కవిటి మండలం రాజపురం సర్పంచి కుటుంబాన్ని కుల పెద్దలు సామాజిక బహిష్కరణ చేసిన ఘటన ఆ ప్రాంతంలో చర్చనీయాంశమైంది. ఏడాది కిందటే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సర్పంచి కుటుంబ సభ్యులతో మాట్లా డినా.. వారి ఇంటికి వెళ్లినా, సంప్రదించినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో ఆయన కుటుంబం సామాజికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటోంది. బహిష్కరణ ఎత్తివేసేందుకు రెండు రోజుల కిందట పెద్దలు సమావేశమై రూ.1.75 లక్షలు జరిమానా విధించారు. ఆయన చెల్లించేందుకు నిరాకరించడంతో బహిష్కరణ కొనసాగుతున్నట్లు తెలిసింది.

దేశాభివృద్ధిలో పోలీసుల పాత్ర కీలకం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: దేశాభివృద్ధిలో పోలీసుల పాత్ర కీలకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు, ధన, మాన ప్రాణాలను కాపాడటంలో పోలీసుల చూపుతున్న చొరవ అభినందనీయం. విధి నిర్వహణలో క్లిష్టమైన బాధ్యతలు చేపడతారు. శాంతిభద్రతల విషయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి వారే. విధి నిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం కల్పిస్తాం. మృతి చెందిన హోంగార్డు కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేస్తాం' అని మంత్రి వెల్లడించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఆపద సమయంలో వెనుకడుగు వేయకుండా ప్రజల ప్రాణ రక్షణ కోసం పోరాడుతున్న పోలీసులను కొనియాడారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ కారుణ్య నియామకాల కింద ఈ ఏడాది ఐదుగురికి ఉద్యోగాలు ఇప్పించామని తెలిపారు. బాధిత కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు పెట్టి నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. విధి నిర్వహణలో అమరులైన బంగారునాయుడు, పాపారావు, నరేంద్రనాథ్, వెంకటరమణ, కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సీనియర్ సెపక్‌తక్రా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా సెపక్‌తక్రా ఛైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. జిల్లాలో తొలిసారి రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు జరుగుతున్నాయని.. విజేతను విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్న 34వ రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు 17 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని ప్రధాన కార్యదర్శి, కోచ్ గాలి అర్జునరావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ పురపాలక ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోరా..?

● 'మీకోసం'లో అర్జీదారుల ఆవేదన



సమస్యలు తెలుసుకుంటున్న సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో అప్పారావు

కలెక్టరేట్(శ్రీకాకుళం), శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: 'ప్రజా పరిష్కార వేదిక మీకోసం' కార్యక్రమంలో అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగైదు సార్లు విన్నవించినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అర్జీకరణ ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో అప్పారావు ఇతర జిల్లా అధికారులు అర్జీలు స్వీకరించారు. 138 వినతులు అందాయని అధికారులు తెలిపారు. ● జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌లో 40 వినతులు అందాయి. వాటిని అదనపు ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు.

అత్యాచార ఘటనపై కేసు నమోదు



సీఐ మోహనరావు, డీఎస్పీ చైర్మన్ బాబూరావుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ సమీపంలోని కోసంగిపురం జగన్న కాలనీలో ఈ నెల 19న రాత్రి జరిగిన అత్యాచార ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరు బాలికలపై అత్యాచారం జరిగినట్లు 'ఈనాడు'లో సోమవారం వెలువడిన కథనం చర్చనీయాంశం కావడంతో ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు బాధితులతో మాట్లాడి చర్యలు తీసుకున్నట్లు సీఐ మోహనరావు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పుట్టిన రోజు వేడుకలకు రావాలని నేతాజీనగర్‌కు చెందిన ఓ యువకుడు కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలికలను ఆహ్వానించాడు. తల్లి కూమార్తెలను పంపించేందుకు నిరాకరించడంతో సాయంత్రం ఆమె లేని సమయంలో బాలికలను ఆహ్వానించిన వ్యక్తి, మరో ఇద్దరితో కలిసి కారులో వెళ్లిపోయారు. కోసంగిపురం సమీపంలోని ఓ ఇంటికి వారిని తీసుకెళ్లారు. బాలికలకు మద్యం కలిపిన శీతల పానీయాలు తాగించారు. అనంతరం ఇద్దరిపై ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. చరవాణిలో దృశ్యాలు చిత్రీకరించారు. బాలికలు అపస్మారక స్థితిలో ఉండగా రాత్రి 10 గంటల సమయంలో ఇంటి వద్ద వదిలేశారు. స్పృహలోకి వచ్చాక తల్లికి విషయం చెప్పారు. సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. విషయం తెలుసుకున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కాశీబుగ్గ పోలీస్ ఠాణాకు చేరుకున్నారు. దోషులు ఎంతటి వారైనా శిక్షించాలని పోలీసులను కోరారు. ఈ విషయాన్ని వైకాపా నాయకులు రాజకీయం చేయవద్దని పేర్కొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

బాలికలపై అత్యాచారానికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీవ్రంగా స్పందించి పటిష్ఠమైన చట్టాలు అమలు చేయాలని కోరారు.

రైతేరాజు

చిట్టి ముత్యాలు.. రైతుకు సిరులు..!

ప్రకృతి సాగుతో దిగుబడులు సాధిస్తున్న రౌతుపురం వాసి

–న్యూస్‌టుడే, నందిగాం, జలుమూరు



సాగులో ఉన్న చిట్టి ముత్యాలు వరి రకం పంట

దేశ సైన్యంలో హవల్దారుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన తరువాత ప్రకృతి సాగు చేస్తూ విభిన్న పంటలు పండించి ఆదర్శంగా నిలుస్తున్నాడు నందిగాం మండలం సైలాడ పంచాయతీ రౌతుపురం గ్రామానికి చెందిన బొడ్డ జగన్నాథం. రసాయన ఎరువుల జోలికి పోకుండా గోమూత్రం, పశువుల వ్యర్థాలు వంటి సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తున్నారు. కొన్నేళ్లుగా పురాతన వరి విత్తనమైన 'చిట్టి ముత్యాలు' అనే ఎరుపు రకానికి చెందిన వరి పంటను ఎకరం పొలంలో సాగు చేస్తున్నారు. ఈ పంట 135 రోజులకు చేతికి అందుతుంది. విత్తనాలు, నారు పోసేందుకు, దమ్ము చేసేందుకు, నాట్లు వేసేందుకు, కోత ఇలా పంట చేతికి అందేసరికి రూ.20 వేల వరకు ఖర్చవుతుంది. ధాన్యం ఎకరాకు 20 బస్తాలు (80 కిలోలు) దిగుబడి వస్తోంది. అత్యంత సువాసనతో కూడిన ఈ ధాన్యం మధుమేహం రాకుండా తోడ్పడుతుంది. కేజీ ధాన్యం ధర మార్కెట్‌లో రూ.60 పలుకుతోంది. 80 కిలోల బస్తా రూ.4,800 పలుకుతోంది. 20 బస్తాలకు రూ.96 వేలు వస్తుంది. పెట్టుబడి పోను రూ.76 వేల ఆదాయం వస్తుందని రైతు జగన్నాథం తెలిపారు.



ఆదాయం బాగుంది: చిట్టి ముత్యాలు వరి రకంపురాతనమైనది. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం ఊపందుకోబట్టి మన రైతులు పలు చోట్ల ఇలాంటి పంటలను పండిస్తున్నారు. నేను ప్రకృతి వ్యవసాయాన్ని నమ్ముకున్నాను. దీన్ని ఎకరం పొలంలో సాగు చేసి మంచి ఆదాయం పొందుతున్నాను. – బొడ్డ జగన్నాథం, రైతు, రౌతుపురం

సస్య రక్షణ చర్యలు ఇలా..

బీజామృతంతో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. మొక్కకు మొక్కకు 12 సెం.మీ. దూరం ఉండేలా నాట్లు వేసుకోవాలి. గాలి, వెలుతురు సమృద్ధిగా తగిలి మొక్క ఆరోగ్యంగా పెరుగుతుంది. మొక్క ఎదుగుదలకు ఘన, ద్రవ జీవామృతాలను పిచికారీ చేయాలి. ఏదైనా తెగులు ఆశిస్తే జిల్లేడు కషాయం, వేప నూనె వంటివి పొలంపై చల్లాలి. పొట్ట దశలో దశపత్ర కషాయం పిచికారీ చేస్తే మంచిది. రసాయనిక ఎరువులు వినియోగించకపోవడంతో అంతగా చీడపీడలు దరి చేరవని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ వర్మ తెలిపారు.

గొర్రెల్లో మూతిపుండ్లు.. నివారణ



జలుమూరు, పాతపట్నం, న్యూస్‌టుడే: శీతాకాలంలో గొర్రెలు, మేకల్లో మూతి పుండ్లు వస్తాయని, వీటి నివారణకు రైతులు తగిన జాగ్రత్తలను తీసుకోవాల్సి ఉందని అచ్యుతాపురం పశువైద్యాధికారి పట్ట సంతోష్‌కుమార్ తెలిపారు. ఇది ఒక గొర్రె నుంచి మరో దానికి తక్కువ సమయంలోనే వ్యాపిస్తుంది. దీని వల్ల జ్వరం రావడంతో పాటు మూతిపై పగుళ్లు ఏర్పడతాయి. గుర్తించిన వెంటనే వాటిని మంద నుంచి వేరు చేసి సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి. పెన్సిలిన్ టీకా వేయించాలి. 10 కిలోల బరువు ఉన్నదానికి 2 మి.లీ. టీకా ఇప్పించాలి. దాణా తీసుకోవడం తగ్గడం వల్ల గొర్రెలు బరువు తగ్గుతాయి. వ్యాధి సోకిన వెంటనే చర్యలు చేపడితే నివారించవచ్చని ఆయన సూచించారు.

చూడి పశువుల సంరక్షణ



సరుబుజ్జిలి, పొందూరు న్యూస్‌టుడే: చూడి పశువులకు గర్భస్రావం అవుతుండటం వల్ల పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సమస్య ఏర్పడకుండా పశుపోషకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సరుబుజ్జిలి పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.సుబ్రహ్మణ్యం వివరించారు. పశువులను మేతకు తీసుకువెళ్లే సమయంలో మందలోని ఇతర పశువులు పొడవడం, అధిక ఉష్ణోగ్రతలు, మినపపొట్టు, ఉలవలు, పిల్లిపెసర, చెరకు వ్యర్థాలు ఎక్కువగా తినడం వల్ల వాటిలో ఈస్ట్రోజన్ అధికమవ్వడం, హార్మోన్ల అసమతుల్యతతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది.

ఇలా చేస్తే మేలు: పశువులు ఎదకు వచ్చిన సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించడం ఉత్తమం. చల్లని ప్రదేశాల్లో ఉంచాలి. ఇవి సాధారణంగా ఏడో నెలలో గర్భస్రావానికి గురవుతుంటాయి. పశువులకు మిశ్రమ దాణా, పచ్చి మేత తినిపించాలి.

చేప పిల్లల పెంపకం.. జాగ్రత్తలు



చెరువుల్లో చేప పిల్లల పెంపకం చేపట్టిన రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తే వాటిని కాపాడుకుంటూ మంచి లాభాలను పొందవచ్చునో ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు ఆయన ఇలా సమాధానాలిచ్చారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

ప్రశ్న: చెరువులో పెంపకం చేపట్టిన చేపల చర్మంపై ఎర్రని మచ్చలు ఏర్పడటం, పొలుసులు ఊడిపోవడంతో చనిపోతున్నాయి. వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి.
– డి.సూర్యనారాయణ, సింగుపురం

సమాధానం: చేపల చెరువుల్లో మురుగు ఎక్కువై, బ్యాక్టీరియా సాంద్రత పెరగడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోంది. చెరువుల్లో 2 శాతం బ్రోమిన్ ద్రావణం లేదా 50 శాతం బీకేసీ ద్రావణం ఎకరాకు లీటరు చొప్పున వేసినట్లయితే ఈ వ్యాధి ఉద్ధృతి తగ్గుతుంది. వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నప్పుడు మేతలు, ఎరువులు వేయరాదు.

ప్రశ్న: చేపల చెరువుల్లో పసర ఎక్కువగా ఉండి తెట్టుగా తయారవుతోంది. ఏ చర్యలు తీసుకుంటే చేపలకు నష్టం వాటిల్లదు. –ఎస్.రామారావు, ఆమదాలవలస

సమాధానం: చేపల చెరువుల్లో ప్లవకాల సాంద్రత ఎక్కువైనప్పుడు ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో నీటి గుణాల్లో మార్పులు వచ్చి చేపలపై ఒత్తిడి ఏర్పడుతుంది. ఎకరాకు 400 గ్రాములు కాపర్ సల్ఫేట్‌ను వాడుకుంటే చెరువుల్లో పసరు తగ్గించుకోవచ్చు.

ఫోన్ కొట్టు.. సలహా పొందు
సాగులో చీడపీడల నివారణ, కొత్త వంగడాలు, ఇతరత్రా సమస్యలపై డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, సేద్యపు విభాగం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త, ఆమదాలవలస, చరవాణి నంబరు 8981880156 ను సంప్రదించాలి.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

చౌక ధరల దుకాణాల హేతుబద్ధీకరణ..!

● డీలర్ల ఖాళీల భర్తీకి చర్యలు

గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న చౌక ధరల దుకాణాల్లో కొన్నింటికి చాలా తక్కువ కార్డులు కేటాయించగా మరికొన్నింటికి ఎక్కువ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని హేతుబద్ధీకరించే ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి కానుంది.



న్యూస్‌టుడే, పోలాకి

జిల్లాలో మొత్తం 1,603 చౌక ధరల దుకాణాలు ఉన్నాయి. ఇందులో 343 ఖాళీగా ఉండటంతో పొరుగున ఉండే డీలర్లను ఇన్‌ఛార్జిలుగా నియమించారు. ఆయా దుకాణాలు కార్డుదారులకు అందుబాటులోకి వచ్చేలా పౌర సరఫరాల సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఒక్కోటి 800 కార్డులకు సేవలు అందించేలా చూస్తున్నారు. తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలంటూ అందిన దరఖాస్తులు 3 వేలకు పైగా అపరిష్కృతంగా ఉన్నాయి. త్వరలో అర్హులందరికీ ప్రభుత్వం కార్డులు మంజూరు చేసే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఖాళీగా ఉన్నవి.. కొత్తగా ఏర్పాటు చేసే వాటికి డీలర్ల భర్తీకి చర్యలు తీసుకుంటారు. హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తయితే గతంలో మాదిరిగా చౌక ధరల దుకాణాల వద్ద సరకుల పంపిణీ జరిగే అవకాశం ఉంది.

కార్డుదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం..



జిల్లాలో చౌక ధరల దుకాణాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత కొత్త డీలర్లను నియమిస్తాం. నూతన కార్డులు మంజూరు చేస్తాం. కార్డుదారులందరికీ కందిపప్పు, పంచదార అందేలా చర్యలు తీసుకుంటున్నాం. దుకాణాలకు వెళ్లి సరకులు తీసుకోవాలా లేక ప్రస్తుతం ఉన్న ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ కొనసాగుతుందా అనే విషయంపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. కార్డుదారులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తాం.
– జి.సూర్యప్రకాశరావు, డీఎస్‌వో, శ్రీకాకుళం

జిల్లాలో రేషన్ కార్డులు 6,71,803 లబ్ధిదారులు 19,77,698

చేపల వేట వలలు దగ్ధం

● రూ. 15 లక్షల ఆస్తి నష్టం



డీమత్స్యలేశం సముద్ర తీరంలో కాలి బూడిదైన వలలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం డీమత్స్యలేశం పంచాయతీలోని సముద్రతీరంలో మత్స్యకారులు పాకల్లో భద్రపరుచుకున్న చేపల వేట వలలు సోమవారం రాత్రి అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వేటకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని ఒడ్డున సిద్ధంగా ఉంచిన వలలు అగ్నిప్రమాదం జరిగి కాలిపోయాయి. శ్రీకాకుళం నగరానికి చెందిన కొందరు ఆకతాయిలు ఇక్కడ సముద్రం ఒడ్డుకు నిత్యం వస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, వారే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నట్లు బాధితులు తెలిపారు. ఘటనలో కోడ గురుమూర్తి, కొర్లయ్య, మరికొందరికి చెందిన సుమారు రూ.15 లక్షల విలువ చేసే వలలు కాలి బూడిదయ్యాయని బాధిత మత్స్యకారులు చెప్పారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకుల అరెస్టు

పాతపట్నం, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి ఆంధ్ర ప్రాంతంలోని రాజమహేంద్రవరానికి గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను సోమవారం పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.లావణ్య పేర్కొన్నారు. ఒడిశా రాష్ట్రం రాయగడ ప్రాంతానికి చెందిన జోసెఫ్, జబాష్, బరేంద్ర అనే ముగ్గురు పర్లాఖెముండి నుంచి పాతపట్నం మీదుగా రాజమహేంద్రవరానికి ఆరు కేజీల గంజాయి తీసుకెళ్తున్నారు. పాతపట్నం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు వారిని పట్టుకున్నారు. సరకు స్వాధీనం చేసుకుని, కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడు..

మెళియాపుట్టి: సంతలక్ష్మీపురం పంచాయతీ టక్కోయి గ్రామంలో జరిగిన చోరీ కేసులో అదే గ్రామానికి చెందిన ఎస్.లోకేశ్వరరావు(ప్రసాద్)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 18న సాయంత్రం పల్లి కనకమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా ఉన్న సమయంలో విద్యుత్తు సరఫరా నిలిపివేసి ఆమె మెడలోని మూడున్నర తులాల పుస్తెల తాడును లోకేశ్వరరావు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పాతపట్నం ఎస్ఐ బి.లావణ్య (ఇన్‌ఛార్జి) ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితుడిని గొప్పిలి వద్ద పట్టుకున్నారు. సొత్తు రికవరీ చేసి, సోమవారం నరసన్నపేట కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

పోలీసు అమరవీరుల త్యాగం సదాస్మరణీయం

కంచిలి గ్రామీణం, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: సమాజ హితం కోసం ప్రాణ త్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని సీఐ మంగరాజు పేర్కొన్నారు. ఎస్‌ఐ రాజేష్‌తో కలిసి బలిమెల దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన సాలినపుట్టుగ గ్రామానికి చెందిన ఆర్ఎస్ఐ సాలిన రామ్మూర్తి విగ్రహానికి నివాళులర్పించారు. ● ఇచ్ఛాపురం జ్ఞానభారతి పాఠశాలలో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.



రామ్మూర్తి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

ప్రభుత్వ బడుల బలోపేతానికి పెద్ద పీట

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల బలోపేతానికి పెద్ద పీట వేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ.రఘువర్మ కోరారు. మండలంలోని గరుడభద్ర, అక్కుపల్లి, బాతుపురం, పల్లిసారథి, డోకులపాడు, వజ్రపుకొత్తూరు, నగరంపల్లి తదితర ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. తల్లికి వందనం కింద అందించనున్న సొమ్ములు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు జమ చేయాలన్నారు. పాఠశాల, ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఇటీవల విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి సమస్యలు విన్నవించినట్లు చెప్పారు. మౌలిక సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు లోకేశ్ చెప్పారని వెల్లడించారు. మార్చిలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో మరోసారి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)	
ఇచ్ఛాపురం	: 9440437129
పలాస	: 8008574279
కవిటి గ్రామీణం	: 8309638875
పలాస గ్రామీణం	: 7386408926
కంచిలి గ్రామీణం	: 9704568738

సమస్య: పలాస మండలం గంగువాడలోని ప్రధాన వీధిలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. - **స్థానికులు**

సమాధానం: చర్యలు తీసుకుంటాం. - **వైకుంఠరావు, మండల విస్తరణాధికారి, పలాస** - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

? బెల్లుపడ కాలనీ ప్రధాన వీధిలో కాలువలను ఆక్రమించి, ఇళ్లు, అరుగులు నిర్మించడంతో మురుగునీరు పారడం లేదు. వాన పడితే మురుగు రోడ్డుపైకి ప్రవహించడంతో కష్టాలు పడుతున్నాం. - **దివాకర్ సాహు, ఇచ్ఛాపురం**

● రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు. పరిశీలించి తొలగిస్తాం. - **ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం** - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పార్కింగ్ ఏర్పాటు చేయాలి

పలాస, న్యూస్‌టుడే: కాశీబుగ్గ ఆంధ్రాబ్యాంకు రహదారిలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని మాజీ కౌన్సిలర్ గొళ్ల చంద్రరావు కోరారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం అధ్యక్షుడు బళ్ల గిరిబాబు, కమిషనర్ ఎన్.రామారావు, సీఐ డి.మోహనరావులకు మంగళవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

వాటిదే రాజ్యం

- ప్రధాన మార్గాల్లో పశువుల తిష్ఠ
- బెంబేలెత్తిస్తున్న శునకాలు
- ఇబ్బందులు పడుతున్న జంట పట్టణాల ప్రజలు



పలాసలో రాత్రివేళ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సేదతీరుతున్న పశువులు

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో పశువులు, శునకాల బెడద ప్రజలను అవస్థలకు గురిచేస్తోంది. ప్రధాన మార్గాల్లో పశువులు బైఠాయించి వాహనాలకు దారివ్వడం లేదు. ఇక శునకాల సంగతి సరేసరి.. గుంపులుగా ఓ చోట చేరి ఆ దారి వెంట వెళ్లే వారిని హడలెత్తిస్తున్నాయి.

పలాస, కాశీబుగ్గ, న్యూస్‌టుడే

కదలవు.. వదలవు

పురపాలక సంఘంలో పశువుల విచ్చలవిడి సంచారాన్ని అరికట్టేందుకు బంజరుదొడ్డి ఏర్పాటు చేయాలి. అక్కడ వీటిని బంధించి, వాటి యజమాని నుంచి అపరాధ రుసుం వసూలు చేయాలి. గతంలో ఉన్నప్పటికీ పురపాలికగా మారేనాటికి కనుమరుగైంది. మూడు రోడ్ల కూడలి నుంచి పలాస ఆర్టీసీ కాంప్లెక్స్, ఇందిరాచౌక్, ప్రభుత్వ జూనియర్‌కళాశాల వద్ద రాత్రిపగలు తేడా లేకుండా రహదారులపైనే సేదతీరుతుండటంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వెళ్లాలంటే భయమే

పలాస, కాశీబుగ్గ జంటపట్టణాల్లో ఏ వీధి చూసినా.. శునకాలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల్ని పట్టుకునేందుకు వచ్చేవారు అందుబాటులో లేకపోవటంతో అవరోధంగా మారుతోంది. దారి వెంట వెళ్లేవారిని కరవడంతోపాటు వాహనాలపై వెళ్లే వారి వెంట పరుగులు తీయడంతో భయపడి ప్రమాదాలు జరిగిన ఉదంతాలూ ఉన్నాయి.

గోశాలకు తరలిస్తాం

పశువుల యజమానులకు నోటీసులు జారీ చేశాం. ఒకటి రెండు రోజులు వేచి చూసి గోశాలకు తరలిస్తాం. కుక్కల నియంత్రణకు శస్త్రచికిత్సలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - ఎన్.రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం



పలాసలోని ఓ వీధిలో కుక్కల గుంపు



వికసించిన విజ్ఞానం

విద్యార్థుల్లో పోటీతత్వం అలవడి, విషయ పరిజ్ఞానం పెంపొందించేందుకు ఈనాడు ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతిభాపాటవ పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని శ్రీగురుకుల విద్యాలయం కరస్పాండెంట్ కె.అశోక్‌వర్ధన్ అన్నారు. కాశీబుగ్గలో శ్రీగురుకుల విద్యాలయంలో 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ప్రథమ కె.శ్రీలత(9వ తరగతి), ద్వితీయ వి.శైలజశ్రీ (10వ తరగతి), తృతీయ కె.మోక్షిత్ (8వ తరగతి) స్థానాలు సాధించి విజేతలుగా నిలిచారు. కరస్పాండెంట్ అశోక్ వర్ధన్, డైరెక్టర్ కృష్ణమూర్తి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. - న్యూస్‌టుడే, పలాస



రక్షణ కరవు

వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి ఉన్నత పాఠశాలకు ముఖ ద్వారం లేకపోడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రీడా మైదానంలో పశువులు, కుక్కలు మూత్ర, మల విసర్జన చేసి పాడు చేస్తున్నాయని, మధ్యాహ్న భోజనం, ఆటల సమయంలో నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. నాడు-నేడు పనులకు సంబంధించి నిల్వ చేసిన ఇసుక, ఇతర సామగ్రి సైతం చోరీకి గురవుతున్నట్లు విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి ముఖ ద్వారం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంఈవో దశరథ తెలిపారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు



పోటీతత్వంతో ఉన్నత శిఖరాలకు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కవిటి, కవిటి గ్రామీణం న్యూస్‌టుడే : విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీ తత్వం ఉంటే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని హెచ్ఎం. బెందాళం మల్లేశ్వరరావు అన్నారు. సోమవారం కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అయోడిన్ లోపం వల్ల వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఇరుకు.. గోతులు..

మందస మండలం కొర్రాయిగేటు నుంచి సువర్ణాపురం వెళ్లే రహదారి తీవ్ర అసౌకర్యంగా మారింది. రెండు వైపులా పొదలు అల్లుకోవడంతో ఇరుకుగా తయారైంది. అల్లిమెరక కూడలి నుంచి పూజానగర్ వరకు అడుగడుగునా గోతులు ఏర్పడి రాళ్లు తేలాయి. వాహనాలు నడపడమూ కష్టంగా ఉందని చోదకులు వాపోతున్నారు. ఈ రహదారి అభివృద్ధికి గతంలో నిధులు వచ్చాయి. సకాలంలో పూర్తిచేయక వెనక్కి మళ్లాయి. మళ్లీ ప్రతిపాదనలు పంపించామని పంచాయతీరాజ్ డీఈఈ రవిబాబు తెలిపారు. - న్యూస్‌టుడే, హరిపురం (మందస)



తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. పలాస తెదేపా క్యాంపు కార్యాలయంలో మంగళవారం గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం, జల్‌జీవన్ మిషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పురపాలక సంఘానికి తాగునీటి సరఫరా కోసం పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. జల్‌జీవన్ మిషన్ నుంచి 8టీఎంసీల నీటిని అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. సమావేశంలో డీఈలు సూర్యనారాయణ, కనకరాజు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

వ్యర్థాల కుప్పలు.. ప్రజలకు తిప్పలు

పలాస మండలం బ్రాహ్మణతర్లాలోని కడి వీధి వద్ద రోడ్డు పక్కనే చెత్త పారబోస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరేఖ దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం



సంక్షిప్త సమాచారం

భక్తిశ్రద్ధలతో నోములు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం పూండిగోవిందపురం శివాలయంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మంగళగౌరీ వ్రతాలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి బ్రాహ్మణ సంఘాలు, వేద దంపతులు పాల్గొని నోము చేపట్టారు.



టీపీసీ ఛైర్మన్‌ను కలిసిన జీడి వ్యాపారులు

పలాస, న్యూస్‌టుడే: రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబురావును పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు చెందిన జీడివ్యాపారులు కలిశారు. సోమవారం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణ పరిధిలో 23వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు కమిషనర్ ఎన్.రమేష్ పరిశీలించారు. గుత్తేదారుడికి పలు సూచనలు చేశారు.

సద్వినియోగం చేసుకోండి

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో గృహనిర్మాణాలపై ప్రతి బుధవారం గ్రీవెన్స్ నిర్వహిస్తామని కమిషనర్ రామారావు తెలిపారు. పలాస మండలం రామకృష్ణాపురం, బొడ్డపాడు, తర్లాకోటలో పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరుచేయటం జరిగిందని, లబ్ధిదారులంతా తమ సమస్యలు పరిష్కారానికి గ్రీవెన్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

న్యూస్‌టుడే, కంచిలి : రెవెన్యూ సదస్సులు మంగళవారం నుంచి నవంబరు 13 వరకు మండలం పరిధి సచివాలయాల్లో జరగనున్నట్లు తహసీల్దారు ఎన్.రమేష్ కుమార్ తెలిపారు. భూ సర్వేలో సమస్యలు, ఫిర్యాదులు ఈ సదస్సులో పరిష్కరిస్తామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు చేపట్టనున్నట్లు తెలిపారు. తొలి రోజు అంపురం పంచాయతీ పద్మతులో సదస్సు జరగనుంది.

పోలీసుల విధులపై అవగాహన

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పోలీస్ వ్యవస్థపై అవగాహన కలిగియుండాలని సీఐ డి.మోహనరావు అన్నారు. కాశీబుగ్గ పోలీస్ ఠాణాలో సోమవారం పలు పాఠశాలల విద్యార్థులకు వైర్‌లెస్ సెట్ వినియోగం, కేసుల నమోదు, విధుల గురించి వివరించారు.



అర్హులకు న్యాయం చేయండి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ

మందస, వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మందస మండలంలోని సంక్షేమ పథకాల అర్హులకు లబ్ధి అందకుండా వైకాపా ప్రభుత్వం ఇబ్బందులు పెట్టిందని. వారికి ప్రస్తుతం సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ కోరారు. మందస తహసీల్దారు కార్యాలంలో సోమవారం 'మీ కోసం' కార్యక్రమంలో బాధితుల తరఫున ఎంపీడీవో సూర్యనారాయణ, తహసీల్దారు హైమావతికి ఫిర్యాదులు అందజేశారు. పింపిడియా పరిధిలో కనపల చెరువు నుంచి సన్నకారు రైతులకు సాగునీరు అందకుండా పెత్తందార్లు అడ్డుకుంటున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని జలవనరులశాఖ ఏఈ శ్రీనివాసరావును కోరారు. ● వజ్రపుకొత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో మరో వినతి పత్రం అందించారు. 2019-24 మధ్య తొలగించిన పింఛన్లు, కొత్తగా మంజూరు చేసిన పింఛన్ల వివరాలతో పాటు 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో మంజూరైన గృహ లబ్ధిదారులకు చెల్లించని బిల్లులు వివరాలు అందించాలని వినతి పత్రం ద్వారా కోరారు.

ధాన్యం సేకరణ సజావుగా జరగాలి



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న తహసీల్దారు రమేష్

కంచిలి, సోంపేట, న్యూస్‌టుడే: మండలానికి సంబంధించిన రైస్ మిల్లర్లు ఖరీఫ్‌లో పండించిన వరి ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేయాలని తహసీల్దారు రమేష్ కుమార్ తెలిపారు. సోమవారం రైస్ మిల్లర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సేకరించాలన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, మండల తెదేపా ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు తదితరులు పాల్గొన్నారు. ● ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. సోంపేట తహసీల్దార్ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో 24 రైతు సేవా కేంద్రాలను 10 క్లస్టర్లగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రైతు నేస్తమా.. నీ జాడేది!



ఇచ్ఛాపురం ప్రాంతంలో పురుగు మందులు స్ప్రే చేస్తున్న రైతులు

వ్యవసాయంలో కనిపించని మిత్రపురుగులు

అధిక రసాయనాల వినియోగంతో అంతరిస్తున్న వైనం



కవిటి గ్రామీణం, సోంపేట న్యూస్‌టుడే

కొన్ని కీటకాలు రైతులకు మేలు చేస్తే మరికొన్ని కీడు తలపెడతాయి. పంటకు ప్రయోజనం కలిగించే కీటకాల్లో మిత్ర పురుగుల పాత్ర కీలకం. ప్రస్తుతం రసాయనాల వినియోగం పెరగడంతో వీటి జాడ కనుమరుగైపోయింది. ఇవి అంతరించిపోతుండటంతో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కలిగిస్తున్నారు.

ఎరువులతో నష్టాలపై అవగాహన

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలో 28,196 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల ద్వారా పురుగు మందుల వినియోగం, అధిక ఎరువుల వాడకంపై జరుగుతున్న నష్టాలను రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

రూపాయి ఖర్చు లేకుండా..: కందిరీగ, మిడత, పొడిసన్‌బగ్ వంటి మిత్ర పురుగులు పంటను ఆశించే చీడపీడ సంతతిని పెరగకుండా నివారిస్తాయి. ఇలా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా రైతన్న పంటకు రక్షణగా నిలుస్తున్నాయి. గతంలో మిత్ర పురుగులు పొలంలో ఉండే విధంగా వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు రైతన్నలు పొలంలో ఏర్పాట్లు చేసుకునే వారు. ప్రస్తుతం క్రిమిసంహారక మందులు అతిగా పిచికారీ చేయడంతో మిత్ర పురుగులు నశించిపోతున్నాయని, వ్యవసాయాధికారులు తెలిపారు.

అవసరం మేరకే వినియోగించాలి

క్రిమి సంహారక మందులు అవసరం మేరకు వినియోగిస్తే మిత్ర పురుగులను రక్షించుకోవచ్చు. రైతులు మోతాదుకు మించి వాడుతుండటంతో ప్రభావం పడుతోంది. పంటపై ఒకటి, రెండు చీడ పురుగులు కనబడితే నివారణ మందులు వాల్సిన అవసరం లేదు. - జగన్మోహనరావు, ఏడీఏ, సోంపేట

వాలంటీర్లకు న్యాయం చేయాలి



పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వాలంటీర్లు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: వాలంటీర్లకు న్యాయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్ పేర్కొన్నారు. వాలంటీర్ల సమస్యలు పరిష్కారం కోరుతూ పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద వాలంటీర్లతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల గౌరవ వేతనం తక్షణం చెల్లించాలన్నారు. రాజీనామా చేసిన వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయ పరిపాలనాధికారి ప్రకాశరావుకు వినతి పత్రం అందజేశారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం భద్రం



వజ్రపుకొత్తూరు: స్టాల్ పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్‌నాయుడు



కవిటి గ్రామీణం: తహసీల్దారు కార్యాలయంలో విక్రయాలు



కంచిలి గ్రామీణం: కొనుగోలుదారుకి కూరగాయలు అందిస్తూ..

సేంద్రియ ఎరువులతో పండించిన ఆహార ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఆరోగ్యకరమైన పోషకాలు శరీరానికి లభిస్తాయని అధికారులు తెలిపారు. ఇచ్ఛాపురం, పలాసలోని పలు ప్రాంతాల్లోని కార్యాలయాల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. గోంగూర, తోటకూర, కొత్తిమీర, బీరకాయలు, బెండకాయలు, జీడిపప్పు ఇతర కూరగాయలు విక్రయించగా పలువురు కొనుగోలు చేశారు. -న్యూస్‌టుడే, బృందం

త్రోబాల్ పోటీల్లో ప్రతిభ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అండర్-14 విభాగం బాలుర త్రోబాల్‌లో రాష్ట్ర స్థాయికి పెద్ద మెళియాపుట్టుగ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి రాధాకృష్ణ ఎంపికయ్యాడు. ప్రధానోపాధ్యాయిని ఉమా మహాపాత్ర్ కృష్ణను అభినందించారు.



రాధాకృష్ణను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

హరిపురం (మందస), న్యూస్‌టుడే: పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా పలాస, ఇచ్ఛాపురం ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బెందాళం అశోక్ తమ నియోజవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి కావాలని అధికారులకు సూచించారు.



అల్లిమెరకలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష



కవిటిలో రహదారి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

టెక్కలి
•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం



ప్రశంసా పత్రాలతో కళాకారులు

'ఆలి తిప్పలు'కు అరుదైన గౌరవం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : టెక్కలి లోని ప్రజాచైతన్య కళాసమితి బృందం ప్రదర్శించిన 'ఆలి తిప్పలు' నాటిక అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. ఈనెల 19, 20 తేదీల్లో తాడేపల్లిగూడెంలో శ్రీశ్రీ కళావేదిక, ప్రపంచ తెలుగు సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతర జరిగింది. 24 గంటల పాటు అంతరాయం లేకుండా ప్రదర్శించిన నాటికకు అమేజింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, టీఎస్ఏ బుక్ ఆఫ్ రికార్డ్స్, కల్చరల్ టాలెంట్ బుక్ఆఫ్ రికార్డ్స్‌లో గుర్తింపు లభించినట్లు బృంద సభ్యులు తెలిపారు.

మొర వినండి..పరిష్కరించండి!

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక.. మీకోసం' కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారుల వద్ద మొర పెట్టుకున్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ

మెళియాపుట్టి మండలం మర్రిపాడు పంచాయతీ పరిధి సర్వే నంబరు 290లో 0.53 సెంట్ల గ్రామ కంఠాన్ని ముగ్గురు వ్యక్తులు తహసీల్దారు సంతకాన్ని ఫోర్జరీ చేసి ఆక్రమించుకుంటున్నారు. సమగ్ర విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకోవాలి. – మామిడి గోవిందరావు





ప్రతిభ చాటి.. విజేతలుగా నిలిచి

టెక్కలి పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్.మురళీకృష్ణ (తొమ్మిదో తరగతి), సీహెచ్.జాహ్నవి (పదో తరగతి), బి.సాయిదీక్షిత (ఎనిమిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. డీన్ నాగరాజు, ప్రిన్సిపల్ పద్మజ విజేతలను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. - న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

అద్దంలా మార్చేందుకు అడుగులు..!

పల్లె దారుల అభివృద్ధికి రూ. 17.46 కోట్లు మంజూరు

న్యూస్‌టుడే, పోలాకి

వైకాపా ఐదేళ్ల పాలనలో నరసన్నపేట నియోజకవర్గంలోని ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా మారినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. గ్రామీణ మార్గాల పరిస్థితి మరింత దారుణం. గోతుల దారుల్లో ప్రయాణించ లేక జనం నరకయాతన అనుభవించారు. ఆయా మార్గాలను అభివృద్ధి వేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గ్రామీణ ప్రజలకు శుభవార్త తెలిపింది. నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్ల నిర్మాణానికి రూ. 17.46 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు.



మెరుగుపడనున్న చోడసముద్రం- సింగివలస రహదారి



అధ్వానంగా వెంకటాపురం- బుడితి రోడ్డు

నిధుల వివరాలు ఇలా..

నరసన్నపేట మండలంలో ఆరు పనులకు గానూ రూ. 4.3 కోట్లు, పోలాకి మండలంలో ఆరు పనులకు రూ. 4.04 కోట్లు, జలుమూరు మండలంలో మూడు పనులకు రూ. 4.9 కోట్లు, సారవకోట మండలంలో నాలుగు పనులకు రూ. 4.22 కోట్లు మొత్తం రూ. 17.46 కోట్లు మంజూరయ్యాయి.

త్వరలో పనులు చేపడతాం

ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. సాంకేతిక అనుమతులు సైతం పూర్తి చేశాం. జియో ట్యాగింగ్ పూర్తయిన వెంటనే గ్రామ పంచాయతీల ద్వారా పనులు చేపట్టాల్సి ఉంది. ఈ నెలాఖరు నాటికైనా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. - సత్యంనాయుడు, డీఈఈ, పీఆర్, నరసన్నపేట

సభ్యత్వ నమోదుపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం నియోజకవర్గంలో నిర్వహించే తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమంపై నాయకులు విస్తృత ప్రచారం చేపట్టాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సోమవారం పాతపట్నంలోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు, క్లస్టర్ ఇంఛార్జిలు, నాయకులు పాల్గొన్నారు.

విశ్వశాంతికి యోగా చక్కని మార్గం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: విశ్వశాంతికి యోగా చక్కని మార్గమని బెంగుళూరుకి చెందిన బి.కె మంజునాథ్ అన్నారు. మండలంలోని చాపర త్రిలోక్ మందిరంలో సోమవారం యోగాపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగాతో ఆరోగ్యంగా జీవించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సుదక్క, వనజక్క పాల్గొన్నారు.

సారూ.. ఇది మీ కార్యాలయం దారే

నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయంతో పాటు మరో పది ప్రభుత్వ కార్యాలయాలకు బురద నీటి నుంచి వెళ్లాల్సిందే. చిన్నపాటి వర్షం పడినా ముఖ ద్వారం వద్ద నీరు నిలిచి పోతుండటంతో రాకపోకలకు సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. కార్లు, ద్విచక్రవాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా, రూ.2 లక్షల నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట



నిర్లక్ష్యానికి నిలువుటద్దం..!



పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి గతంలో ప్రభుత్వం వాహనాన్ని కేటాయించింది. దీనిలో తహసీల్దారు ప్రయాణిస్తూ విధులు నిర్వహించేవారు. సుమారు దశాబ్ద కాలం క్రితం జీపు మరమ్మతులకు గురికావడంతో కార్యాలయ ఆవరణలో విడిచిపెట్టారు. మరమ్మతులు చేయడమో, జిల్లా కార్యాలయానికి అప్పగించడమో చేయక పోవడంతో పూర్తిగా పాడైంది. వాహనంలోనే చెట్లు మొలిచిన పరిస్థితి నెలకొంది. ఇదే విషయమై తహసీల్దారు ఎస్.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా తుక్కుగా మార్చేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, పాతపట్నం

శిథిల భవనం తొలగించాలి

నందిగాం మండలం వల్లభరాయపాడు ప్రాథమిక పాఠశాల పూర్వ భవనం పైకప్పు తిత్లీ తుపాను సమయంలో కూలిపోయింది. గోడలు మాత్రమే మిగిలాయి. ప్రస్తుతం కొత్త భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. దీని పక్కనే శిథిల భవనం ఉండడంతో విరామ సమయంలో పిల్లలు అక్కడకు వెళ్తున్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మండల ఇంజినీరింగ్ అధికారిని సంప్రదించి శిథిల భవనాన్ని తొలగిస్తామని ఎంఈవో జి. నరసింహులు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం



చెత్త కుప్పలకు చిరునామా..!




టెక్కలి పట్టణంలోని పాత జాతీయ రహదారిని ఆనుకుని గొల్లవీధి, పెద్దబ్రాహ్మణ, ఆదిఆంధ్ర వీధులకు మధ్యన ఉన్న రావిచెరువు చెత్త కుప్పలకు చిరునామాగా మారింది. ఒకప్పుడు వందలాది కుటుంబాలు ఈ చెరువులోని నీటిని వినియోగించే వారు. ప్రస్తుతం ఆచెరువు పెద్దదానికి సైతం వీలుకాని పరిస్థితి. రేవుల వద్ద నిర్మించిన మెట్లపై వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. పారిశుద్ధ్య పనులు జరిపించి పూర్వవైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు మాట్లాడుతూ తక్షణమే శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

రాళ్ల మీద నుంచే రాకపోకలు

కొత్తూరు మండలంలోని లబ్బ పంచాయతీ కేంద్రం నుంచి సీతంపేట మండలం గుమడకు వెళ్లే గ్రామీణ రహదారి దుర్భరంగా మారింది. దీనిని మెరుగు పరిచేందుకు కూటమి ప్రభుత్వం రూ.80 లక్షల నిధులు మంజూరు చేసింది. రెండు నెలల క్రితం పనులు ప్రారంభించారు. రోడ్డు తవ్వి వదిలేయడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. రాళ్ల మీద నుంచే రాకపోకలు చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ సమస్యపై పంచాయతీ రాజ్ ఏఈ గౌరీశంకర్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా పనులు నిలిపివేశామని, ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, కొత్తూరు



వ్యాధులపై అప్రమత్తత అవసరం



శిబిరంలో సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారి శ్రీకాంత్

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి శ్రీకాంత్ ఆదేశించారు. స్థానిక ఆది ఆంధ్రావీధిలో వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఆయన వెంట డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్, వైద్యులు భాగ్యశ్రీ, గాయత్రి, సుజాత ఉన్నారు.

డిగ్రీ విద్యార్థుల ఆందోళన

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. పెంచిన కోర్సు ఫీజుల్ని తక్షణమే తగ్గించాలని డిమాండు చేశారు. కోర్సు ఫీజు బకాయిలు చెల్లిస్తేనే పరీక్ష ఫీజు కట్టించు కుంటామని చెప్పడం సరికాదన్నారు. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ గోవిందమ్మ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు.

రాకపోకలు నిలిపివేత

టెక్కలి పట్టణం: సీతాపురం గ్రామం వద్ద రైల్వే ట్రాక్‌పై ఓవర్ ఆయిలింగ్ పనుల కారణంగా సీతాపురం- బొరిగిపేట మార్గంలో మంగళవారం వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పనులు జరుగుతాయని, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు సాగించి సహకరించాలని కోరారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న వాహనాలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై చిన్నబమ్మిడి సమీపంలో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి కారు ఢీకొంది. అదే సమయంలో కారును మరో వాహనం ఢీకొనడంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఎన్‌హెచ్ సిబ్బంది ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నారు.

ముగ్గురికి గాయాలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి-మెళియాపుట్టి మార్గంలో నర్సింగపల్లి సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటో కల్వర్టును ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేర్పించి ప్రాథమిక చికిత్స అందించారు. పోలీసులు బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: ప్రభుత్వం పాడి రైతులకు ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు లోకనాథం సూచించారు. సోమవారం యలమంచిలి, పట్టుపురం, రామయ్యపేట, కిష్టుపురం, సింహాద్రిపురం, సాలిపేట, పొన్నానపేట గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. వైద్యుడు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో సంక్షేమ ఫలాలు



గొల్లలవలసలో రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, న్యూస్‌టుడే: పాలన చేపట్టిన వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం మండలంలోని వనితమండలం, గొల్లలవలస, ఎస్ఎల్‌పురం, చీడివలస గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. జడూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంఛార్జి బలగ ప్రవీణ్, తెదేపా నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, నాయకులు ఎం.అప్పలనాయుడు, బైరి భాస్కరరావు, సూరపు నారాయణదాస్ పాల్గొన్నారు.

ఘనంగా నందెన్న నిమజ్జనోత్సవం

జలుమూరు, పాతపట్నం, న్యూస్‌టుడే: జలుమూరు మండలం లింగాలవలసలో నందెన్న నిమజ్జనోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. భక్తుల కోలాటాలు, ఆటపాటలతో స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం సమీపంలో ఉన్న వంశధార ప్రధాన ఎడమ కాలువలో అనుపు కార్యక్రమం జరిగింది. ★ పాతపట్నం కోటగుడ్డికాలనీకు చెందిన భక్తులు నందెన్న విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి మహేంద్రతనయ నదిలో నిమజ్జనం చేశారు.



లింగాలవలసలో కోలాట బృందం ప్రదర్శన

ముగిసిన టెట్

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు సోమవారంతో ముగిశాయి. స్థానిక కోర్ టెక్నాలజీ కేంద్రంలో ఈనెల 3న టెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 10,095 మంది అభ్యర్థులకు గానూ 1,101 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం డిపార్టుమెంటల్ అధికారి పి.దాలినాయుడు తెలిపారు.

24న హుండీ ఆదాయం లెక్కింపు

జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీముఖలింగేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని ఈనెల 24న లెక్కించనున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు సోమవారం తెలిపారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు హుండీల తాళాలు తెరవనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనవచ్చని ఈవో చెప్పారు.

ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలి

కొత్తూరు, న్యూస్‌టుడే: ఆదివాసీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. మండలంలోని గొట్టిపల్లి గ్రామ సచివాలయం ఎదుట సోమవారం వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొట్టిపల్లి, అడ్డంగి, కారిగూడ, లబ్బ పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారన్నారు. వీటిని పరిష్కరించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందించారు.



గొట్టిపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

నిర్వాసితుల సమస్యలపై వినతి



హిరమండలం, న్యూస్‌టుడే: మండలంలోని భూ వివాదాలతో పాటు వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు కోరారు. సోమవారం టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. వంశధార నిర్వాసితులకు గత ప్రభుత్వం చెల్లించిన అదనపు పరిహారం కొంతమందికి అందలేదన్నారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ ప్రాధాన్య క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

మహిళా ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం

హిరమండలం, న్యూస్‌టుడే: మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. సోమవారం గులుమూరు, కొండరాగోలు పంచాయతీల్లో మహిళా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులు, దస్త్రాలను పరిశీలించారు. సిబ్బంది అప్పలస్వామి, మోహిని, గిరి పాల్గొన్నారు.

గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయండి

సారవకోట, న్యూస్‌టుడే: డిసెంబర్ నెల లోపు గృహ నిర్మాణాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం సూచించారు. గృహనిర్మాణ, రెవెన్యూ అధికారులతో సారవకోటలో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మోహన్‌కుమార్, ఈవోపీఆర్డీ ప్రభాకరరావు పాల్గొన్నారు.

అపార్ నమోదులో అప్రమత్తత

పోలాకి, న్యూస్‌టుడే: అపార్ నమోదులో ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలని మండల విద్యాశాఖాధికారి టి.లింగరాజు అన్నారు. సోమవారం మండల రిసోర్స్ భవనంలో నిర్వహించిన హెచ్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాణాప్రతాప్‌కు సత్కారం

హిరమండలం, న్యూస్‌టుడే: రుగడ గ్రామానికి చెందిన రాణాప్రతాప్‌ను శ్రీశ్రీ కళావేదిక నిర్వాహకులు సోమవారం సత్కరించారు. ఈనెల 19 నుంచి 20 వరకు తాడేపల్లిగూడెంలో జరిగిన కళాజాతరలో ఆయన పాల్గొని తెలుగు కవితలు చదివారు. ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలువురు తెలుగు కవులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..అన్నీ

తాగునీరు అందించరూ..

కోటబొమ్మాళి: అయిదేళ్లగా కురుడు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు అందడం లేదని గ్రామస్థులు సోమవారం ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్‌కు విజ్ఞప్తిచేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీవో స్పష్టంచేశారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు

హిరమండలం, నరసన్నపేట: ఈనెల 22 నుంచి 25 వరకు హిరమండలంలోని మూడు గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆర్.కాళీప్రసాదరావు తెలిపారు. ★ సంచార ఆధార్ నమోదు కేంద్రాలను ఈనెల 22 నుంచి నిర్వహిస్తున్నట్లు నరసన్నపేట ఎంపీడీవో మధుసూదనరావు తెలిపారు. మడపాం, కంబకాయ, యారబాడు, తెలగవలస కేంద్రాల్లో ఈనెల 25 వరకు సేవలు అందుతాయని వివరించారు.

దస్త్రాలు పక్కాగా నిర్వహించాలి

నరసన్నపేట గ్రామీణం: నిబంధనల మేరకు ఉపాధ్యాయులు దస్త్రాలు పక్కాగా నిర్వహించాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు ఆదేశించారు. చెన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ఎల్ఎన్‌పేట భగవాన్ సత్యసాయి, శిర్డిసాయి మందిరం ఆధ్వర్యంలో శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు స్థానికంగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి, 45 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు టి.రామారావు, షణ్ముఖరాలు తెలిపారు.



చెరువులు నిండాయి.. గుండెలు నిబ్బరమయ్యాయి

ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



పొంగిపొర్లుతున్న కల్లాడ పద్మనాభసాగరం

– న్యూస్‌టుడే, నందిగాం

నందిగాం మండలంలో ఖరీఫ్ సీజనులో సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఎటువంటి సాగునీటి వనరులు లేని కొండ ప్రాంతాల్లో దాదాపు 13 వేల ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్న అన్నదాతలకు సాగునీరు అందక ఏటా ఆటుపోట్లు తప్పడంలేదు. వేరే దారి లేక కూలీలుగా మారి పలువురు వలసబాట పట్టేవారు. ఈ ఏడాది గొలుసు చెరువులు నిండుకుండల్లా మారడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేలన్నీ పచ్చగా కనిపిస్తుండడంతో వారి కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

చేలు బాగున్నాయి




ఒకటిన్నర ఎకరాల్లో వరి పంట వేశాను. గ్రామంలోని ఊర చెరువు, ఇతర బందలు నిండుగా ఉండటంతో ఈ ఏడాది సాగునీటికి ఢోకా ఉండదు. చేలు పొట్టదశకు చేరుకున్నాయి. మరో రెండు తడులకు వర్షం పడితే రబీలో అపరాలు పండించుకోవచ్చు. - నందిగాం శాంతారావు, సవరరామకృష్ణాపురం



హర్షబాడ వద్ద వరి పంట

ఇబ్బందులు ఎదుర్కొనే వాళ్లం



ఏటా నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొనే వాళ్లం. వంశధార కాలువ ద్వారా నీరు సైతం అందేది కాదు. ప్రస్తుతం గ్రామంలోని చెరువులు నిండుకుండల్లా ఉన్నాయి. పంట చివరి వరకు వాతావరణం సహకరిస్తే ఆశించిన మేర దిగుబడులు వస్తాయి. – చౌదరి రామారావు, రైతు, దిమ్మిడిజోల

భక్తుల ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు

టెక్కలి, న్యూస్‌టుడే: రావివలసలోని ఎండల మల్లికార్జునస్వామి క్షేత్రానికి కార్తికం మాసంలో వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. నౌపడా- మెళియాపుట్టి రోడ్డు నుంచి మల్లన్న క్షేత్రం మీదుగా డీపీఎన్ (డోల- పోలాకి- నౌపడా) రహదారి వరకు రెండు కిలోమీటర్ల మేర అత్యవసర మరమ్మతులు చేసేందుకు రూ.63 లక్షలు మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మరమ్మతులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు సోమవారం ఆదేశించారు. దీపావళి నాటికి పనులన్నీ పూర్తిచేయాలని సూచించారు. నిధులు మంజూరుపై స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

తెరపై ఈనాడు

★ కీర్తన: వీక్షణం ★ కీర్తిక: సత్యం సుందరం ★ కిన్నెర సినీమాక్స్: ఇద్దరు ★ ఎస్వీసీ (రామలక్ష్మణ): వేట్టయన్ ★ సూర్యమహల్: విశ్వం ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: జనక అయితే గనక ★ మారుతి: లవ్ రెడ్డి

– న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఉప ముఖ్యమంత్రికి ఎంపీ కృతజ్ఞతలు



విజయనగరం జిల్లా గుర్లలో ఇటీవల అతిసారంతో మృతి చెందిన పది మందికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం ప్రకటనతో ఆ కుటుంబాలకు మనో ధైర్యం కలిగిందని, దీనికి ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఉప ముఖ్యమంత్రి అతిసార బాధితులను పరామర్శించడానికి సోమవారం విజయనగరం రాగా ఆయన్ను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

సృజనకు పదును






విద్యార్థుల్లో పోటీతత్వం, సామాజిక స్పృహ పెంచేందుకు 'ఈనాడు' నిర్వహిస్తున్న పోటీలు తోడ్పడతాయని విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం నగరం పీఎన్ కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్‌లో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. పి.శ్రీకీర్తి (పదో తరగతి), పి.జోష్‌కుమార్ (9వ తరగతి), బి.స్పృజన (8వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. పాఠశాల డైరెక్టర్ పి.శ్రీకాంత్, ఉపాధ్యాయులు హెచ్.రమణ, ఎం.వెంకటరావు, వి.సరోజిని తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

ప్రతిభ చాటారు..





ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలస మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగంతో లాభ, నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీ జరిగింది. ఆర్.పూజ (10వ తరగతి), జి.నిహ (10వ తరగతి), ఎం.హేమహాసిని (10వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులు టి.భారతి, ఎం.సరిత, జి.రమేష్, వి.నీరజ, జె.రాజారావు, బి.జనార్దనరావు, బి.సూర్యనారాయణ ప్రశంసాపత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

పూడుకుపోతున్న చెరువులు...

సాగునీటికి తిప్పలు..!

గ్రామాల్లోని సాగునీటి చెరువుల్లో పూడిక, పనికిరాని మొక్కలు పేరుకుపోవడంతో వీటి పరిధిలోని వందల ఎకరాల పంట పొలాలకు సాగునీరు సరిగ్గా అందడం లేదు. గత అయిదేళ్లలో వైకాపా పాలకులకు వీటి అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో వీటి నుంచి పొలాలకు సాగునీరందించే కాలువలు పనికిరాని మొక్కలతో నిండిపోవడంతో శివారు భూములకు సాగునీరందడం కష్టంగా మారింది. కొన్ని చోట్ల చెరువు గట్లకు గండ్లు పడటం, తూములు అధ్వానంగా ఉండటంతో నీరు వృథాగా బయటకు పోతోంది. దీంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.



సరుబుజ్జిలి: అభివృద్ధికి నోచుకోని పాలవలస చెరువు

న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు

ప్రతిపాదనలకే పరిమితం: ఆమదాలవలస నియోజకవర్గంలో 786 చెరువులు ఉండగా వీటిలో 27 మాత్రమే అభివృద్ధికి నోచుకున్నాయి. చెరువులు, కాలువల కింద 38,383 మంది రైతులు 42,253 ఎకరాలు సాగు చేస్తున్నారు. వీటి నిర్వహణకు ఏటా నీటిపారుదలశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడమే తప్పా ఎలాంటి నిధులు మంజూరు కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులను అభివృద్ధి చేసి శివారు ఆయకట్టు భూములకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

● **ఆమదాలవలస:** మండలంలోని కొర్లకోట, వెదుళ్లవలస, తురకపేట, నెల్లిపర్తి, జొన్నవలస, మునగవలస, సైలాడ రామచంద్రాపురం, పొన్నాంపేటల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో రైతులు పంటల సాగురే అవస్థలు పడుతున్నారు.

● **పొందూరు:** మండలంలోని గోరింట, రాపాక, బురిడికంచరాం, లోలుగు, కింతలి, బాణాం తదితర గ్రామాల చెరువులు కూడా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో పనికిరాని మొక్కలతో దర్శనమిస్తున్నాయి.

● **సరుబుజ్జిలి:** మండలంలోని షళంత్రి, పాలవలస, కొత్తకోట, నక్కలపేట, వీరమల్లిపేట, సింధువాడ, మర్రిపాడు, బురిడివలస తదితర గ్రామాల చెరువులు ఏళ్లతరబడి అభివృద్ధికి నోచుకోలేదు. వీటి పరిధిలో 10,026 మంది రైతులు 11,539 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పూడిక పేరుకుపోవడంతో చెరువుల్లో తగినంత సాగునీరు నిల్వ ఉండటం లేదు. దీంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

● **బూర్జ:** మండలంలోని నీలంపేట, తోటవాడ, అయ్యవారుపేట, అన్నంపేట, కొల్లివలస, వైకుంఠపురం, ఉప్పినివలస, సింగన్నపాలెం, తమ్మినాయుడుపేట తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

అభివృద్ధికి చర్యలు.. నియోజకవర్గంలోని సాగునీటి చెరువుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. ఉపాధిహామీ పథకంలో నిధులు మంజూరైన వెంటనే పనులు చేయిస్తాం.

– రాంబాబు, మోహనరావు, శంకరరావు, సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు మండలాల నీటిపారుదలశాఖ జేఈలు

కొవిడ్ అనాథ బాలలకు కేంద్రం సాయం

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: కొవిడ్ కారణంగా జిల్లాలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన తొమ్మిది మంది బాలలకు కేంద్ర ప్రభుత్వం పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్ పథకం కింద రూ.10 లక్షలు చొప్పున మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని కలెక్టర్ సంరక్షకుడిగా పిల్లలతో సంయుక్త ఖాతాలను నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో తెరిపించారు. వారికి 18 ఏళ్లు నిండిన తరువాత వ్యక్తిగత ఖాతాగా మారుస్తారు. అనంతరం ప్రతి నెల రూ.5,500 స్టయిఫండ్‌గా ఖాతాలో జమ చేశారు. ఇప్పటివరకు జమ అయిన రూ.1.68 లక్షలను చింతపల్లి మూర్తికి, చింతపల్లి గీతకు సొంత ఇంటి నిర్మాణం నిమిత్తం రూ.1.32 లక్షలు సోమవారం ఉపసంహరించి ఇప్పించారు. తపాలా శాఖ సూపరింటెండెంట్ వి.హరిబాబు, జిల్లా బాలల రక్షణాధికారి కేవీ రమణ, ప్రధాన తపాలా కార్యాలయాధికారి పి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కరాటే శిక్షణ



డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో వసతిగృహాల్లోని విద్యార్థినులకు సోమవారం కరాటే శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను వర్సిటీ వీసీ ఆచార్య కె.ఆర్.రజని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినుల ఆత్మరక్షణకు, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ శిక్షణ తరగుతులను ప్రారంభించినట్లు, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరాటే శిక్షకురాలు ఆర్.ఝాన్సీ, పీడీలు ఎం.శ్రీనివాసరావు, ఎ.భాస్కర్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

ముగిసిన టెట్

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు(టెట్) జిల్లాలో ఈ నెల 3వ తేదీ నుంచి మూడు కేంద్రాల్లో ప్రారంభమై సోమవారంతో ముగిశాయి. ఎచ్చెర్లలో శివాని ఇంజినీరింగ్ కళాశాల, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్ కేంద్రాల్లో రోజుకు రెండు షిఫ్టుల్లో జరిగాయి. వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో అన్ని సబ్జెక్టులు కలుపుకొని మొత్తం 3,201 మంది అభ్యర్థులకు గాను 2,865 మంది పరీక్షలకు హాజరయ్యారు. శివాని ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో 1,020 మందికి గాను 918 మంది హాజరయ్యారు.



వెంకటేశ్వర ఇంజినీరింగ్ పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను పంపుతున్న సిబ్బంది

అధ్వానంగా రహదారి




ఆమదాలవలస మండలం బొబ్బిలిపేట-వెదుళ్లవలస గ్రామాల రహదారి అధ్వానంగా మారడంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వ పాలనలో దీని మరమ్మతులకు చర్యలు తీసుకోలేదని బొబ్బిలిపేట, వేదుళ్లవలస గ్రామస్థులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ ఆంజనేయ నాయక్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే నిర్మాణం చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

ఇలా ఉంటే ఎలా..!

ఆమదాలవలస మండలం దూసి రైల్వే స్టేషన్‌లో రెండు, మూడు ప్లాట్‌ఫాంలపై పనికిరాని మొక్కలు ఏపుగా పెరిగి ఉండటంతో రైల్వే ప్రయాణికులు రైలు దిగి వాటి మధ్యలో నుంచే బయటకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని వారు మండిపడుతున్నారు. వాటిని తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై రైల్వే అధికారులు మాట్లాడుతూ పనికిరాని మొక్కలను తొలగించేలా చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీ



అల్లుకున్న నిర్లక్ష్యం..!



పొందూరు పట్టణానికి సమీపంలో ఉన్న రైల్వే వంతెన పక్కన విద్యుత్తు తీగలపైకి పొదలు పాకి దట్టంగా అల్లుకున్నాయి. దీంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాటిని వెంటనే తొలగించేందుకు విద్యుత్తు శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు శాఖ ఏఈ రమణమూర్తితో 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, పొందూరు, పొందూరు గ్రామీణం

వ్యర్థాలతో చిక్కులు



శ్రీకాకుళం నగరంలోని పాత వంతెన వద్ద నాగావళి నదీ తీరంలో వ్యర్థాలు పేరుకుపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా నదీ తీరాన్ని శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు చెత్తను నదిలో వేయకుండా నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన డబ్బాల్లో వేసి సహకరించాలని కోరారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

సంక్షిప్త సమాచారం

విద్యార్థినులు చైతన్యంతో మెలగాలి

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: మంచి, చెడు స్పర్శలకు మధ్య తేడాపై విద్యార్థినులు అవగాహన కలిగి చైతన్యంతో మెలగాలని శ్రీకాకుళం మహిళా పోలీసుస్టేషన్ ఎస్సై ఎం.వెంకటరావు తెలిపారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎదుటి వ్యక్తులు అనుచితంగా తాకినప్పుడు ప్రతిఘటించాల్సిన పద్ధతులనువిద్యార్థినులకు తెలిపారు. ఏఎస్సై సరోజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష..

పొందూరు, న్యూస్‌టుడే: తీర ప్రాంతాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి లోకేశ్ అన్నారు. పొందూరు మండల పరిషత్తు కార్యాలయంలో మండల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రమాదం పొంచి ఉందని, ఆ సమయంలో మండల అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలందించాలని తెలిపారు. ఎంపీడీవో మన్మథరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం నిర్వహించిన రీసర్వేలో రైతుల సమస్యలు పరిష్కరించేందుకు మంగళవారం నుంచి కూటమి ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తుంది. ఎచ్చెర్లలో ఈ నెల 22న పూడివలసలో ప్రారంభమవుతాయని, నవంబరు 5న రావివలస, చిరల్లపాలెం గ్రామాల్లో గ్రామసభలతో ముగుస్తాయని రీసర్వే డీటీ ఎన్.తిరుపతిరావు తెలిపారు. రైతులు ఈ సభల్లో తమ సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.



సేవలు మరింత విస్తృతపరచండి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: సత్యసాయి సేవా సమితుల ద్వారా సేవలు మరింత విస్తృతపరచాలని సత్యసాయి సేవా సమితి జోనల్ కోఆర్డినేటర్ ఎం.జనార్దనరావు అన్నారు. సత్యసాయి బాబా అవతార ప్రకటన దినోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని అక్కులపేట-వేణమ్మపేట సత్యసాయి సేవా సమితి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమితి కన్వీనర్ సూర్యారావు, భక్తులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ దీపాల వితరణ

బూర్జ, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారని జనసేన శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, తూర్పు కాపు సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లి జయరాం అన్నారు. సోమవారం మండలంలోని కొల్లివలసలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన ఎల్ఈడీ దీపాలను పాఠశాలకు వితరణగా అందించారు. ప్రిన్సిపల్ దువ్వాడ దేవనంద్, సేపేన శ్రీనుబాబు, వైస్ ప్రిన్సిపల్ ఎ.లక్ష్మణ్, సేపేన రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని కేశవరావుపేట పంచాయతీ లక్ష్ముడుపేట సమీపంలోని తోటల్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను ఎచ్చెర్ల పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.52 వేల నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సందీప్‌కుమార్ తెలిపారు.



ప్రజలకు సత్వర సేవలు అందించండి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ప్రజలకు సత్వర సేవలు అందించాలని.. విధుల్లో అలసత్వం వహిస్తే సహించబోమని సచివాలయ సిబ్బందిని నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు హెచ్చరించారు. శ్రీకాకుళం నగరంలోని సీబీ రహదారిలో వార్డు సచివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. దస్త్రాలు తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ సిబ్బంది ఉన్నారు.


మాదిగల సంక్షేమానికి చంద్రబాబు కృషి



ప్రదర్శనగా వెళ్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుకూలంగా వ్యవహరించడంతో పాటు మాదిగలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు అన్నారు. సీఎం మాదిగల సంక్షేమానికి కృషి చేయడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హిందూపురం నుంచి ప్రారంభమైన మాదిగ కృతజ్ఞత యాత్ర సోమవారం శ్రీకాకుళం చేరుకుంది. నగరంలోని ఎన్జీవో హోం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు కె.శ్రీనివాస్‌మాదిగ, కె.కార్తీక్, హేమంత్ కుమార్, కె.ప్రమీల, కె.తేజ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల తయారీకి ఎంపిక



ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: నూతన విద్యా విధానం అమలులో భాగంగా ఎన్‌సీఈఆర్‌టీ ఈ నెల 22 నుంచి 24 వరకు మైసూర్‌లో నూతన పాఠ్యపుస్తకాల తయారీపై కార్యక్రమం నిర్వహించనుంది. రణస్థలం మండలం కొచ్చెర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న **బి.రాజేశ్వరరావు** దీనికి ఎంపికయ్యారు. ఆయన గతంలో రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యపుస్తకం తయారీలో యునెస్కో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రాథమిక విద్య బోధనా విధానాలపై కూడా పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, ఎంఈవో ఎ.త్రినాథరావు, ఉపాధ్యాయులు ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.

శారదా పీఠాన్ని వాణిజ్య కేంద్రంగా మార్చారు

పొందూరు, న్యూస్‌టుడే: విశాఖ శారదా పీఠాన్ని హిందూ ధార్మిక కేంద్రంగా కాకుండా వాణిజ్య కేంద్రంగా మార్చేశారని రాష్ట్ర సాధు పరిషత్తు అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి తెలిపారు. సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో హిందూ దేవాలయాల పైనా, దేవుళ్ల పైనా దాడులు జరిగితే ఒక్క మాట మాట్లాడని శారదా పీఠాధిపతి స్వరూపానంద గత ముఖ్యమంత్రి సేవలో తరించారని విమర్శించారు. భీమిలి సమీపంలో వేద పాఠశాల ఏర్పాటు అంటూ వందల కోట్ల రూపాయల భూమిని తీసుకొని వాణిజ్య అవసరాలకు అనుమతులు తీసుకోవడంపై మండిపడ్డారు. శారదాపీఠం అవకతవకలపై కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరారు. ● నిబంధనల ప్రకారం కలెక్టర్ అనుమతులు, రెవెన్యూ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న చర్చి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని జి.సిగడాం మండలం వాండ్రంగి పంచాయతీ చీడిపేట గ్రామస్థులు ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతిని కోరారు.

మొర వినండి.. పరిష్కరించండి!

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక..మీ కోసం' కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారుల వద్ద మొర పెట్టుకున్నారు.

న్యాయం చేయాలి.. మాది రణస్థలం మండలం పెసరపాలెం. మా కుమారుడు అరుణ్‌కుమార్ పైడిభీమవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. పాఠ్య పుస్తకాలు ఇస్తున్న సమయంలో తెలుగు ఉపాధ్యాయుడు నగిరి అరుణ్‌కుమార్ కర్రతో విద్యార్థులను కొట్టారు. ఆ కర్ర మా కొడుకు కంట్లో గుచ్చుకుని రక్తం వచ్చింది. ప్రధానోపాధ్యాయుడు రూ.వెయ్యి ఇచ్చి పంపారు. వైద్యులకు చూపించగా కంటికి 90 శాతం చీము పట్టింది.. చూపు రావడం కష్టమని చెప్పారు. నా కుమారుడికి న్యాయం చేయాలి. – చెన్న నాగరాజు

హాస్టల్లో ప్రవేశం కల్పించరూ.. పారా మెడికల్ డిప్లొమా కోర్సు చదువుతున్నాం. వసతిగృహంలో ప్రవేశం కల్పించాలి. వసతిగృహంలో సీటు రాకపోవడంతో రోజూ ఇంటి నుంచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.

– పారా మెడికల్ డిప్లొమా విద్యార్థినులు




సంతవురిటి బీసీ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి జ్యోత్స్న

సమస్యల పరిష్కారానికి చర్యలు అవసరం

జి.సిగడాం, పొందూరు, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న తెలిపారు. జి.సిగడాం మండలం సంతవురిటి, పొందూరు మండలం రాపాక ఎంజేపీ పాఠశాల వసతి గృహాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంతవురిటి వసతి గృహ సంక్షేమాధికారి ప్రభాకరరావు, న్యాయవాదులు ఎం.రాము, కె.అశోక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గౌరీదేవి నవరాత్రి మహోత్సవాలు



నక్క వీధి ఉమాజఠలేశ్వరాలయంలో గౌరీదేవికి ప్రసాదాల నివేదన

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: పాత శ్రీకాకుళం నక్క వీధి ఉమాజఠలేశ్వరాలయంలో గౌరీదేవి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నందీశ్వరుడి విగ్రహంపై కొలువుదీరిన శివపార్వతులకు వివిధ రకాల వంటకాలు, మిఠాయిలు నివేదించారు. 22న పుష్పార్చన, 23న గౌరమ్మ జానపద గీతాలాపనలు, 24న సహస్ర దీపాలంకార సేవ, 25న సామూహిక లలితా సహస్ర నామ పారాయణం నిర్వహించనున్నారు.

బాబోయ్.. శునకాలు..!



పట్టణంలోని ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కుక్కల గుంపు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస పట్టణంలో ఎక్కడ చూసినా కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ చిన్నారులు, వృద్ధులు, మూగజీవాలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో రోడ్లపై సంచరించేందుకు ప్రజలు, ప్రయాణికులు భయపడుతున్నారు. మాంసం దుకాణాలు ఎక్కడపడితే అక్కడ ఉండటంతో వాటి వద్ద వ్యర్థాలను తింటూ తిరుగుతూ వాహన చోదకుల వెంటపడుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో సుదూర ప్రాంతాల నుంచి రైల్వేస్టేషన్‌కు వస్తున్న ప్రయాణికుల వాహహలను వెంబడించి భయపెడుతున్నాయి. ప్రతి నెలా పదుల సంఖ్యలో వీటి బారిన పడి గాయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు వీటి బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడం లేదని పుర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ వివరణ కోరగా వెంటనే తగిన చర్యలు చేపడతామన్నారు.